ప్రజాశక్తి
బుధవారం 7, డిసెంబర్ 2022 5 అనంతపురం

అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కళ్యాణదుర్గంలోని అంబేద్కర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

న్యాయశాస్త్ర విభాగంలో అడ్మిషన్ల రద్దు సరికాదు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్‌కె యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగంలో అడ్మిషన్ల రద్దు సరికాదని, విసి నియంతృత్వ ధోరణిని విడనాడాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. ఎస్కే యూనివర్సిటీలో న్యాయశాస్త్ర విభాగంపై విసీ నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ అనంతపురం పట్టణంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో మేధావులు, లాయర్లు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఓతూరు పరమేష్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, యూనివర్సిటీ లా విద్యార్థి తరిమెల గిరి, టిపి.రామన్న, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పథ్వి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో చరిత్ర కలిగి, ఎన్నో పోరాటాలతో ఏర్పాటైన శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రంలో ప్రవేశాలను నిలిపి వేయాలని యూనివర్శిటీ రిజిస్ట్రారు ఉన్నత విద్యాశాఖకు నివేదిస్తూ లేఖ రాయడం శోచనీయమన్నారు. లేఖలో న్యాయ శాస్త్ర విభాగంలో అధ్యాపకులు ఇద్దరే వున్నందున తమ యూనివర్శిటీలో అడ్మిషన్లు నిలిపివేయాలని కోరారన్నారు. వాస్తవంగా యూనివర్సిటీలో సమస్యలను, ఉన్నతాధికారుల నియంతృత్వ పోకడలను, అన్యాయాలను న్యాయ శాస్త్ర విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్ నియంతృత్వ పోకడలు, వివాదాస్పద నిర్ణయాలు అమలుకావడం లేదన్నారు. దీంతో విసి యూనివర్సిటీలో న్యాయశాస్త్ర విభాగం లేకుండా చేయాలని కుట్రపన్నారన్నారు. ప్రస్తుతం న్యాయశాస్త్ర విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఆరుగురు గెస్ట్ ప్రొఫెసర్లు ఉన్నారన్నారు. ప్రత్యామ్నాయ పద్ధతులను చూసు కోవాల్సిందిపోయి ఇలా అడ్మిషన్లను నిలుపుదల చేయాలని అనుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఎస్‌వి యూనివర్సిటీ అనుబంధంగా ఉన్నపుడే 1973లోనే శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీలో లా విభాగం ఏర్పాటు అయిందన్నారు. ఈ విభాగం నుండి చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు నేడు జడ్జిలు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, మంత్రులు తదితర ఉన్నతమైన స్థాయిల్లో ఉన్నారని తెలిపారు. ప్రయివేట్ కళాశాలల్లో చదవాలంటే రూ.లక్షల్లో ఖర్చు పెట్టాల్సి ఉంటుందన్నారు. అదే యూనివర్సిటీలో అయితే తక్కువ ఖర్చు అవుతుందన్నారు. యూనివర్సిటీ అధికారులు అనాలోచిత నిర్ణయానికి కరువు జిల్లాలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాలవారు నష్టపోవాల్సి వస్తుందన్నారు. న్యాయశాస్త్రం విద్యార్థుల భవితవ్యాన్ని, రాయలసీమ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యూనివర్సిటీలో లా అడ్మిషన్లు యథావిథంగా కొనసాగే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలలో ఖాళీలను భర్తీచేసి ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనివర్సిటీ అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే, జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించకుంటే పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు, మేధావులు, న్యాయవాదుతో కలిసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆదాయం తక్కువ..ఖర్చు ఎక్కువ..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంది. అధికారులు తమ విధులను విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత లాభం తప్ప మార్కెట్ కమిటీ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని సమాచారం. ఫలితంగా మార్కెట్ ఫీజుల వసూలు దారుణంగా పడిపోయింది. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఒక్క ఏడాది కూడా మార్కెట్లు లాభాల్లో పయనించ లేదు. గడచిన ఎనిమిది నెలల్లో రాబట్టిన మార్కెట్ ఫీజు వసూళ్లే ఇందుకు నిదర్శనం. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు తొమ్మిది మార్కెట్ కమిటీల నుంచి రూ.5 కోట్లు మాత్రమే వసూలు చేశారు.

వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అటకెక్కిన అభివృద్ధి

నిర్లక్ష్య ధోరణిలో సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

అధికారుల నిర్లక్ష్యంతో మార్కెట్ యార్డుల్లో అభివృద్ధి అటకెక్కింది. హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ఈ ఏడాది రూ.82.34 లక్షలు మాత్రమే వసూలు చేశారు. దీనికి ప్రదాన కారణం ఫీజు వసూలులో అధికారుల అలసత్వమే కారణమని తెలుస్తోంది. తప్పని సరిగా ఈ-నామ్ విధానం అమలు జరిగితే మార్కెట్‌కు ఆదాయం పెరగుతుంది. అయితే మార్కెట్‌కు వచ్చే ఆదాయంతో తమకు పని లేదని..తమకు వచ్చే ఆదాయానికి గండి పడకూడదని భావించి కొంతమంది మార్కెట్ అధికారులు వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లతో కలిసి పోయి ఈ-నామ్‌కు ఎగనామం పెడుతున్నారు. మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీంతో ఒక్క ఏడాది కూడా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చలేక పోయారు.

లక్ష్యం ఘనం..వసూళ్లే దారుణం..

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో గడచిన ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు చేరుకోలేదు. 2017-18 సంవత్సరంలో రూ.2.42 కోట్లకు గాను రూ.2.18 కోట్లు, 2018-19 లో రూ.2.56 కోట్లకు గాను రూ.2.30 కోట్లు, 2019-2020లో రూ.2.53 కోట్లకు గాను రూ.1.69 కోట్లు, 2020-2021లో రూ.2.47 కోట్లకు గాను రూ.58.67 లక్షలు, 2021-2022లో రూ.1.85 కోట్లకు గాను రూ.1.47 కోట్లు, 2022-2023లో రూ.2.25 కోట్లకు గాను ఇప్పటి వరకు అక్టోబర్ నాటికి రూ.82.34 లక్షలు మాత్రమే వసూలు చేశారు. అదే విధంగా జిల్లాలో అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాప్తాడు, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి ఆదాయ వనరులను ఆధారంగా చేసుకుని రాష్ట్ర ఉన్నతాధికారులు రూ.10.43 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు రూ.5.4 కోట్లు వసూలు చేశారు. ఇందులో అనంతపురం, రాప్తాడు, శింగనమల కమిటీలు వసూళ్ల పరంగా బాగానే ఉన్నాయి. ఈ కమిటీలు ఇప్పటికే 50 శాతానికిపైగా వసూళ్లు రాబట్టాయి. ఆ తరువాత తాడిపత్రి పర్వాలేదనిపించినా.. మిగిలిన కమిటీల పరిస్థితి దారుణంగా ఉంది. ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుంతకల్లు, గుత్తి మార్కెట్ కమిటీలు ఫీజు వసూళ్లలో అధ్వానంగా ఉన్నాయి. 30 శాతం కూడా వసూలు చేయకపోవడం గమనార్హం. గుంతకల్లు మార్కెట్ కమిటీ 15.60 శాతంతో అట్టడుగు స్థానంలో ఉంది.

హిందూపురం మార్కెట్ యార్డులో వ్యాపారాలు జరుగుతున్న దృశ్యం

ఆదాయం తక్కువ ఖర్చు ఎక్కువ

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండు మిర్చి, చింత పండు ప్రధాన పంటలు. ఇక్కడి మార్కెట్‌కు ఆంధ్రతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి రైతులు వారు పండించిన పంటను విక్రయిస్తున్నారు. దీని కోసం 117 మంది కమిషన్ ఏజెంట్లు, 110 మంది ట్రేడర్లు ఉన్నారు. దీంతో పాటు కొడికొండ చెక్‌పోస్టు, మేళాపురం వద్ద రెండు చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంది. గడచిన ఐదు సంవత్సరాల్లో ఒక్క ఏడాది కూడా ఖర్చుకు మించి ఆదాయం రాలేదు.

దష్టి సారించని పాలకవర్గం..

మార్కెట్ యార్డుల అభివృద్ధి పట్ల పాలకవర్గ సభ్యులు దృష్టి సారించడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా కమిటీల పాలనా కాలం ముగిపోయింది. పాలకవర్గ సభ్యులు పాలనా సమయంలో మార్కెట్ అభివృద్ధికి ఏమాత్రం చొరవ చూపలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ పాలకవర్గ సభ్యులు కేవలం పదవులకే పరిమితమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల మార్కెట్ యార్డులకు రిజ్వరేషన్లు ఖరారు అయ్యాయి. ఈ క్రమంలోనే రెండు కమిటీలకు కొత్త పాలకవర్గ సభ్యుల నియామకం పూర్తి అయింది. త్వరలో మిగిలిన కమిటీలకు కొత్త పాలకవర్గ సభ్యుల నియామకం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త పాలక వర్గ సభ్యుల రాకతోనైనా అభివృద్ధి సాధ్యమవుతుందా.. లేకపోతే పాత పాలకవర్గ సభ్యుల మాదిరిగానే ఉండిపోతారో వేచి చూడాలి.

పోలీసుశాఖలో హోంగార్డుల విధులు కీలకం

జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-అనంతపురం

పోలీసుశాఖలో హోంగార్డుల విధులు కీలకమని జిల్లా ఎస్పీ డాక్టరు పక్కీరప్ప కాగినెల్లి అన్నారు. అనంతపురం నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో 60వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ఫక్కీరప్ప ముఖ్య అతిథిగా హాజరై సాయుధ హోంగార్డుల ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..1963లో ఆవిర్భవించిన హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారింది. పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. సాధారణ డ్యూటీల మొదలు క్లిష్టతర విధుల వరకు అన్నింటా చక్కగా పని చేస్తున్నారన్నారు. పోలీసుశాఖ క్రమశిక్షణకు మారుపేరన్నారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెంచేలా విధులు కొనసాగాలని సూచించారు. పోలీసు సిబ్బందితో సమానంగానే హోంగార్డులకు కూడా సంక్షేమ చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఎ.హనుమంతు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిఐలు రవిశంకర్‌రెడ్డి, శివరాముడు, కత్తి శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, మోహన్, రాము, ఆర్ఐ శివరాముడు, ఎస్ఐలు సుధాకర్ యాదవ్, శ్రీనివాసులు, వంశీకష్ణులు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్ పాల్, జిల్లాలోని హోంగార్డులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

అమరవీరుల జ్యోతి యాత్రను జయప్రదం చేయండి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొదట అమరులైన దొడ్డి కొమరయ్య అమరవీరుల జ్యోతియాత్రను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఎపి రైతుసంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రారంభమైన యాత్ర కేరళ రాష్ట్రంలోని త్రిశూరులో ముగుస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 7న బుధవారం ఈ యాత్ర పామిడికి చేరుకుంటుందన్నారు. కావున భారీ ఎత్తున తరలివచ్చి యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులపై దాడులు తీవ్రతరం చేసిందన్నారు. ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా పంటలకు గిట్టుబాటు ధర సమస్యగా మారిందన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర చట్టం తీసుకురావాలని, భూములు, మార్కెట్లు, గోదాములను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకే మోడీ సర్కార్ మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. వాటిని నిరసిస్తూ ఏడాది పాటు పోరాటం చేసి 750 మంది రైతులు అమరులయ్యారన్నారు. దీంతో అప్పట్లో ఆయా చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. అయితే మళ్లీ ఇప్పుడు దొడ్డిదారిన ఆ చట్టాలను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పార్లమెంట్‌లో రుణ విమోచన, మద్దతు ధరల చట్టాలను తీసుకురావడంతోపాటు విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేరళ రాష్ట్రంలోని త్రిశూరులో జరుగుతున్న 35వ అఖిల భారత కిసాన్ సభ మహాసభల్లో రైతాంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, నాయకులు నల్లప్ప, సంగప్ప, పోతలయ్య, వన్నూరప్ప పాల్గొన్నారు.

జెఎన్‌టియు విద్యార్థులకు 'జర్మనీ' విద్య

ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని విద్యార్థులు జర్మనీ బెర్లిన్ స్టైన్ బిసిస్ యూనివర్సిటీలో ఎంప్లాయిమెంట్ లింక్డ్ పీజీ విద్యను అభ్యశించే అవకాశం కల్పించేందుకు ఒప్పందం జరిగినట్లు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అక్టోబర్ నెలలో ఉన్నత విద్యామండలి ప్రతినిధులతోపాటు తాము జర్మనీలో పర్యటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి పలు యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా జర్మనీలోని బెర్లిన్ స్టయిన్బీస్ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ పిజి ప్రోగ్రాముల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన ఒప్పందంలో అనంత జెఎన్‌టియు, కాకినాడ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు ప్రవేశాలు పొందే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా నాలుగు మాస్టర్స్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. మాస్టర్స్ ఇన్ బిజినెస్ ఇంజినీరింగ్, మాస్టర్ ఇన్ ఇండస్ట్రీయల్ ఇంజనీరింగ్, మాస్టర్ ఇన్ బిజినెస్ ఇన్ఫర్మేషన్, మాస్టర్ ఇన్ ఐటీ సర్వే సిస్ ఇన్ఫర్మేషన్‌లలో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. వీటిలో భాగంగా జర్మనీ భాషను విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తారని తెలిపారు. రెక్టార్ యం.విజయకుమార్ మాట్లాడుతూ జర్మనీలో 85 శాతం ఇండస్ట్రీ బెస్ట్ ఎడ్యుకేషన్, 15 శాతం థియరాటికల్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, విశాలి, కె.మాధవి, డి.విష్ణువర్ధన్, బి.దిలీప్, కళ్యాణి రాధ, తదితరులు పాల్గొన్నారు.

వాషింగ్ మిషన్ వృథా నీటిపై వివాదం

యువతిని రాళ్లతో కొట్టి హత్య చేసిన వైనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. వాషింగ్ మిషన్ నుంచి వెళ్తున్న వృథా నీటి విషయంలో రెండు కుటుంబాల మధ్య మంగళవారం ఉదయం జరిగిన ఘర్షణలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. సిఐ మధు వివరాల మేరకు.. కదిరి పట్టణంలోని మశానంపేట ఉట్టి వద్ద వీధిలో పద్మావతి బాయి, మనోజ్ కుమార్ దంపతులు కాపురం ఉంటున్నారు. పద్మావతిబాయి ఇంట్లోని వాషింగ్ మిషన్ నుంచి వచ్చే వృథా నీరు పక్కనే ఉన్న వేమన్న నాయక్ ఇంటి ముందుకు వెళ్లింది. ఈ విషయంలో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో వేమన్న నాయక్, అతని కుమారుడు ప్రకాష్ నాయక్ పద్మావతిపై ఇనుప రాడ్డు, బండరాళ్లతో దాడిచేశారు. దీంతో ఆమె ముఖం, తలపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు పద్మావతిని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు ఆమెను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళు ుండగా మార్గ మధ్యంలో మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బంగి శివ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణ, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలను కొనసాగిస్తోందన్నారు. విద్య, ఉపాధి, శాస్త్రీయ విద్య అమలు, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల అమలు కోసం, విద్య వ్యాపారీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నట్లు వివరించారు. ఆయా విషయాలపై చర్చించేందుకు ఈనెల 7, 8వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, గౌతమ్, నాయకులు సచిన్, రాము, షణ్ముఖ, ఈరేష్ పాల్గొన్నారు.

గుంతకల్లు : ఈనెల 7, 8వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కిషోర్ కుమార్, నాయకులు చందు, భీమా, హుస్సేన్, దివాన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయుడు మాకొద్దు..

గోవిందవాడ గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని గోవింద వాడ గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు డి.షాకీర్‌బాషా మాకొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం స్థానిక పాఠశాల వద్ద ఆందోళన వ్యకం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ అధ్యక్షులు గురులింగ మాట్లాడుతూ ఇలాంటి ఉపాధ్యాయుడి వల్ల పాఠశాలకే చెడ్డ పేరు వస్తోందన్నారు. ఈయన సకాలంలో విధులకు హాజరుకాకపోగా సక్రమంగా బోధించడం లేదన్నారు. ఈయన్ను ఇలాగే కొనసాగిస్తే తమ పిల్లల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతడు ఇప్పటికే ఒకసారి సస్పెండ్ అయ్యి తర్వాత ఇక్కడి వచ్చాడన్నారు. వెంటనే ఉపాధ్యాయుడిని మార్చాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై మండల విద్యాధికారిని వివరణ కోరగా విషయాన్ని డిఇఒ దృష్టికి తీసుకెళ్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు లోకేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తిప్పేస్వామి, వన్నూరుస్వామి, ఓబులేసు, నరసింహులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల గేటు వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
E.P.155/2022 in O.S.616/2016.

Between:
S.Alivelamma ...**Petitioner**
And
K.Alla Bakash ...**Respondent**

TO
K.Alla Bakash S/o K.Mahaboob Sahib, Retd.Head Master, Lakshmi Nagar, Ananthapuramu.

పై దావాలో అర్జీ దారురులు దావా మొత్తము రాబట్టు నిమిత్తము, C.C.D లో ఉన్న మొత్తమును అటాచ్‌మెంట కొరకు అర్జీ దాఖలు చేసి వున్నది. ఇందులకు నీకేమైన ఆక్షేపణలున్న యెడల పై కోర్టువారి ఎదుట తేది16-12-2022 న ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొన వచ్చును. లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
T.RANGA REDDY,
ADVOCATE FOR PETITIONER

In the court of the prl.Junior Civil Judge, Dharmavaram
O.S.No: 143/2021

Between:
G.Alla Bakash ...**plaintiff**
And
M.K.Rahamthulla ...**Defendant**

Notice to Defendant.

To
M.K.Rahamthulla S/o Hussain Peera, RTC Driver STNo:408901, Dharmavaram Depot, Dharmavaram.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 29-12-2022 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
M.P.SUBBA RAO, D.ABDUL SAB
ADVOCATES, ANANTHAPURAMU

In the court of the principal Junior Civil Judge, Ananthapuramu
O.S.No:485/2019

Between:
M.Narayana Reddy ...**plaintiff**
And
K.Allabakash ...**Defendant**

Notice to Defendant.

To,
K.Allabakash S/o K.Mahaboob Sahib, Muslim, aged about 62 years, working as L.F.L.Head Master, Aman Municipal Corporation Urdu Elementary School, Ashok Nagar, Ananthapuramu Town.

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 18-01-2023 వ తేదిన వాయిదా వేసినారు. కావున ఆ దినం ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని ఎడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
N.C.SREENIVASULU
Advocate, Ananthapuramu
Cell:8142422135

In The Court of The IInd Addl. Junior Civil Judge, Ananthapuramu
O.S.No: 1138/2019

Between:
Canara bank (Rep by its authorized Officer Manager and Authorized officer, Canara Bank, Gondireddy Palli Branch, Rapthadu Mandal, Ananthapuramu Dist ...**plaintiff**
And
J.Suseelamma ...**Defendant**

Notice to Defendant.

To
J.Suseelamma w/o J.Muthyalappa, D.No:22/328, Yadava Street, Dharmavaram.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 30-12-2022 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
చిల్మకూరి శ్రీనివాసులు,
వాదిపరం వకీలు, అనంతపురం

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో:గుత్తి
S.O.P. NO:6/2022.

Between:
1.వెన్నపూస జయమ్మ, 2.వెన్నపూస రాజశేఖర రెడ్డి, 3.వెన్నపూస అనిమిరెడ్డి, 4.మూల లక్ష్మీదేవి.. ...**అర్జీదారులు**
V/S
...నిల్ ...**రెస్పాండెంట్**

పబ్లిక్ నోటీసు

పై అర్జీలో 1వ అర్జీదారురాలికి భర్త అయిన మరియు 2 నుంచి 4 అర్జీదారులకి తండ్రి అయి 04-11-2021వ తేది చనిపోయిన వెన్నపూస శంకర్ రెడ్డికు M.శ్రీనాథ్ రెడ్డి అను అతనినుంచి రావలసిన ప్రానోటు తేది 06-04-2021 బాపతు మొత్తమును రాబట్టుకొనుటకు దావా వేయడానికి అవసరైన " వారసత్వపు సర్టిఫికెట్ " పొందు నిమిత్తము పై కోర్టులో పై అర్జిని దాఖలు చేసి ఉన్నారు.సదరు అర్జీమీద ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో 15-12-2022 తేదిన పై కోర్టు ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు హాజరు అయి మీ అభ్యంరములు తెలుపుకొనవచ్చును. లేని యడల కోర్టు వారు రికార్డుల ఆధారముగా తీర్మానము చేయుదురు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
C.రమేష్ నాథరెడ్డి, M.A.,M.L.,
Y.హనీఫ్ బాష, B.Com.,LL.B,
న్యాయవాదులు, తాడిపత్రి
Z,సతీష్, B.A.,LL.B, న్యాయవాది, గుత్తి.

In the court of the Hon'ble prl. District Judge, Ananthapuramu
G.W.O.P. No:65/2022

(In The Matter of Appoinment of Guardian and for Permission to Sell The Property of The Mother of (1).Poluru Hari Sree Chawdare aged 12 years (2).Poluru Hishsri Chawdare aged 10 years and (3).Poluru Havishh Chowdari aged 9 years Who being Minors)

Between:
Poluru Hari Narayana S/o Poluru Nageswara Rao Ex-Army Person/Cultivation, R/at D.No:1-51, Maddikera village and Mandal, Kurnool Dist. ...**petitioner**
and
Nil ...**Respondent**

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునదేమనగా పై కోర్టు కేసులో మైనర్లు అయిన (1).Poluru Hari Sree Chawdare (2).Poluru Hishsri Chawdare (3).Poluru Havishh Chowdari లకు సంబంధించిన ఆస్తిని అమ్ముకుటకు పై కోర్టులో అర్జీదారుడు అర్జీదాఖలు చేసియున్నాడు. సదరు కేసు 24-12-2022 వ తేదీ ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నచో స్వయముగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల కోర్టు వారు ఏకపక్షముగా తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

SCHEDULE

Property situated in R.D of Anantapuramu and S.R.D of Guntakal within the village fields of Thimmanacherla of Guntakal mandal.

Babu	Sy.No.
Govt.	301 A 1B
Dry	Ac.3.04 cents

Situated in northern side of Vijayanagar colony, of Guntakal municipality, new ward 11, present ward 13, near door No.165.R20, plot No.29 of open site, bounded by: East: 20 feet road, West: Plot No.40 site and North: Plot No.30 site and South: Plot No.28 site in Janda Katta in between East-West: 60 feet or 18.288 mts, North-South: 20 feet or 6.096 mts in total 133.33 Square yards or 111.207 square mts open site.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.SREENIVAS REDDY,
ADVOCATE, ANANTHAPURAMU.
Y.ASWARTH NARAYANA REDDY,
ADVOCATE, GUNTAKAL.

కళ్యాణదుర్గం ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి

పారిశ్రామికవేత్త జీకే కృష్ణమూర్తి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రముఖ పారిశ్రామికవేత్త జీకే కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం బెంగళూరుకు చెందిన పోస్‌పోల్ కంపెనీ ప్రతినిధులు కిరణ్, శశిధర్‌తో కలిసి రాప్తాడు, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని ముత్తిమడుగు, తిప్పేపల్లి, భానుకోట, మద్దెలచెరువు, కర్తనపర్తి, తిమ్మసముద్రం, గోళ్ల సిబాయి తదితర ప్రాంతాల్లో భూములను పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారులు, నీటి వనరులు, రవాణా సౌకర్యం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడి ఈ ప్రాంత స్థితిగతులు, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఆరాతీశారు. యువత ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి పరిశ్రమల ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కవితా బుజ్జన్న, రామన్న యాదవ్, వైసిపి రమణ, వీరేష్‌యాదవ్, నవీన్, రాజేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, ముత్యాలు, గోవిందరాజులు, గోళ్ల రాము, జయరాం, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

గోళ్ల ప్రాంతంలో భూములను పరిశీలిస్తున్న ప్రతినిధులు పారిశ్రామికవేత్త జీకే కృష్ణమూర్తి, తదితరులు

అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-పుట్లూరు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం మండలంలోని రంగమానాయునిపల్లి గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. సిఎం జగన్ చేతగానితనం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్ నాయుడు, శివశంకర్‌రెడ్డి, లక్ష్మమయ్య, భాస్కర్‌నాయుడు, రాజేష్‌నాయుడు, ఆదినారాయణరెడ్డి, వెంకటరమణ, దస్తగిరి, రంగప్ప, పెద్దయ్య, శ్రీనివాసులురెడ్డి, రవీంద్ర, తీర్థమయ్య, ఓబన్న, పెద్దిరాజు, చంద్ర, నగేష్, రాజు, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని గడ్డంనాగేపల్లి గ్రామంలో మంగళవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ఆలం నరసానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దుర్మార్గపు పాలన సాగిస్తోందన్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డంనాగేపల్లి సర్పంచి నాగన్న, నాయకులు బాలయ్య, రమేష్, ప్రసాద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం అనంతపురం నియోజకవర్గ పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే మేనిఫెస్టోను అమలు చేయడం ప్రారంభించామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపడుతున్నామన్నారు. అభివృద్ధి ఒక ప్రాంతానికే పరిమితం కాకూడదన్నదే సీఎం జగన్ ఆలోచన అన్నారు. అందుకోసమే వికేంద్రీకరణ చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో వెళ్తుంటే స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు తమ దృష్టికి తెస్తున్నారని, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటుండడంతో చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయని తెలిపారు.

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ యం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ కొనియాడారు. ఈమేరకు నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్ బాషా, నగర కార్యదర్శులు విశ్వనాథ్, సంపత్, శేషాద్రి, సంయుక్త కార్యదర్శులు ఆకుల అశోక్, పవన్, మంగళ కృష్ణ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం భారత ప్రజలకు అనేకమైన హక్కులు, చట్టపరమైన విధులు ఉండాలని ప్రపంచ దేశాల్లోకెల్ల అత్యంత దఢమైన భారత రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాజ్యాంగంలో కుల, మత బేధాలు లేకుండా అందరికీ హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి మార్తమ్మ ఆంజనేయులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ బిక్కీ నాగలక్ష్మి హరి, అర్చన, కుమారి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాస్, దురదకుంట వన్నూరుస్వామి, కరుణాకరన్, భాస్కర్‌రెడ్డి, తిప్పేస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని గుత్తిలో మంగళవారం జెవివి ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రామాంజనేయులు, పి.వెంకటరామిరెడ్డి, పద్మవాణీ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కె.బాబు, బీఎస్పీ నాయకులు విజయ్, వెంకట కొండయ్య, ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు కుల్లాయి బాబు, శామ్యూల్, భీమలింగ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని గ్రంథాలయంలో అధికారిణి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయవేత్తగా అంటరానితనం, కుల నిర్మూలన కోసం అంబేద్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల నాయకులు రాజు, కోట్రేష్ కుమార్, అనిల్, వివేక్, శివ, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మల్లి, కౌన్సిలర్ ప్రశాంతి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు భారతి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, మాజీ కౌన్సిలర్. వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ స్వగృహంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔన్నత్యాన్నిచ ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించి, బడుగు బలహీన వర్గాలకు సమన్యాయం చేసేందుకు అందరం కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో ఎస్సై వెంకటప్రసాద్ చేతుల మీదుగా రోగులకు బ్రెడ్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై నాగరాజు, కానిస్టేబుల్ హరి, ఎమ్మార్పీఎస్ నాయకులు గంగయ్య, నారాయణ, రాజు, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉరవకొండ డిపో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి దేవాంజనేయులు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ప్రపంచానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో నివాళులర్పించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి కళ్యాణ్‌కుమార్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ సభ్యుడు టి.ఆదినారాయణ, సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, లైబ్రేరియన్ ఆదిమూర్తి, భవిష్య కార్మిక సంఘం మండల కార్యదర్శి బోగాతి రామేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఎస్ఐ, కానిస్టేబుల్ నియామకాల్లో వయోపరిమితి పెంచాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్ఐ, కానిస్టేబుల్ నియామకాల్లో అభ్యర్థుల వయోపరిమితితోపాటు పోస్టుల సంఖ్య, పరీక్ష గడువును పెంచాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని టవర్‌క్లాక్ దగ్గర డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎస్ఐ, కానిస్టేబుళ్ల పోస్టులకు వయోపరిమితి ఐదు సంవత్సరాలు పెంచాలని, పోస్టుల సంఖ్య, పరీక్ష సమయం పెంచాలని డిమాండ్ చేశారు. ఫైర్, జైలు వార్డెన్ల ప్రస్తావనే లేదన్నారు. నిరుద్యోగుల సంఖ్య ఆధారంగా పోస్టులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సోమశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ఇంటి ముందర పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఎలాంటి రోగాలు దరిచేరవని బెలుగుప్ప వైద్యాధికారి కార్తీక్ కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీలోని చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. తర్వాత అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమైన చిన్నారులను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఎంఎల్‌హెచ్ పి.శ్రావణి, పార్వతమ్మ, వీరశేఖర్, రాధాకృష్ణ, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జిల్లా సమగ్ర శిక్షా అభియాన్‌లో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టులకు మంగళవారం సాయంత్రం జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఇన్‌ఛార్జి డిఇఒ ఎం.వెంకటకృష్ణారెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, సమగ్ర శిక్షా ఎపిసి కె.తిలక్, విద్యాసాగర్ కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 11 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ముగ్గురు గైర్హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో నియామక ఉత్తర్వులు అందజేయనున్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని గోవిందవాడ గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాల మంజూరు చేయాలని వైసిపి నాయకుడు ఎల్.లోకేష్ డిమాండ్ చేశారు. మంగళవారం గోవిందవాడలోని స్వగృహంలో ఆయన మాట్లాడుతూ గోవిందవాడలోని 151వ సర్వేనెంబర్‌లో కొంతమందికి పట్టాలు మంజూరు చేశారన్నారన్నారు. అయితే స్థలాలు మాత్రం చూపలేదన్నారు. గ్రామంలో దాదాపు 600 కుటుంబాల దాకా నిరుపేదలు నివాసం ఉంటున్నాయన్నారు. వారందరికీ సొంతిళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున అధికారులు స్పందించి పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భర్త వన్నూరుస్వామి, వైస్ ప్రెసిడెంట్ తనయుడు తిప్పేస్వామి, నాయకులు రమేష్, ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు తోడ్పాటు

లీడ్ జిల్లా మేనేజర్ నాగరాజారెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని లీడ్ జిల్లా మేనేజర్ నాగరాజారెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బ్యాంకు రుణ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాండ్ ఆఫ్ ఇండియా, పీఎం ఉపాధి కల్పన, చేనేత ముద్ర, పిఎం సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలను ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.నాగరాజారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి కె.రాజశేఖర్‌రెడ్డి, డి.ఐజయ్య, జిల్లా చేనేత జౌళి,శాఖ అధికారి ఎస్.బసవరాజు, గుత్తి ఎపిఎం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని డోనేకల్, కడదరబెంచి, విడపనకల్, చీకులగురికి తదితర గ్రామాల్లో ఎఇఒ రాఘవేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం పత్తిపంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారులు విజయ్ భాస్కర్,లక్ష్మన్న,రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

డోన్ ఎన్నికల పరిశీలకులుగా కోనా మురళీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం వైసిపి ఎన్నికల పరిశీలకులుగా గుత్తి మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈయన గతంలో సర్పంచి, ఎంపిపిగా పని చేశారు. రాజకీయ అనుభవం ఉన్న మురళీధర్‌రెడ్డిని డోన్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా నియమిస్తూ సిఎం జగన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మురళీధర్‌రెడ్డి తన స్వగృహం నుంచి అనుచరులు, వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి గాంధీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ బిఆర్.అంబేద్కర్, వైఎస్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. తనను ఎన్నికల పరిశీలకులుగా నియమించినందుకు సిఎంతోపాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, నాయకులు సుభాష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సివి.రంగారెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పూలమాలు వేసి అభినందనలు తెలిపారు.


కోనా మురళీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

ఆత్మకూరు : మండలంలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన మెనూ ధరలు పెంచాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పాత మెనూ ప్రకారమే భోజనం అందించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పంట మార్పిడితో పెరగనున్న భూసారం

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

గార్లదిన్నె : తాము పండించే పంటలను పంట మార్పిడి చేయడం వలన తమ భూమిలో పోషక విలువలు పెరిగి భూసారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని జమ్ములదిన్నె గ్రామానికి చెందిన రైతు రామ్మోహన్ కొర్రపంటలో పంట కోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల పంటలు సాగు చేసినందుకు రైతు రామ్మోహన్‌ను అభినందించారు. అనంతరం చేపట్టిన పంటకోత ప్రయోగంలో ఎకరానికి 167.44 కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఎఎస్ఒ రాజ్యలక్ష్మి, బిఆర్ఒ సుధాకర్, ఎఇఒ స్రవంతి, విహెచ్ఎ ఆదినారయణ, రైతులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలను నిర్వహిస్తున్న అధికారులు

నారా లోకేష్‌ను కలిసిన అనంత టిడిపి నేతలు

అనంతపురం సిటీ : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ మంగళవారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో అనంతపురం అర్బన్ నియెజవర్గ టిడిపి నాయకులు కలిసి సత్కరించారు. ఈకార్యక్రమంలో రాయల్ మురళీ, రుద్రంపేట పంచాయతీ నాయకులు వడ్డే వెంకట్రాముడు, నాగభూషణం, టౌన్ బ్యాంకు డైరెక్టర్ వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బిసి సభకు భారీగా తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విజయవాడలో ఈనెల 7వతేదీన నిర్వహించనున్న జయహో బిసి సభలో పాల్గొనేందుకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం నుంచి ఆపార్టీ శ్రేణులు మంగళవారం భారీగా తరలివెళ్లాయి. ఈ సందర్భంగా విజయవాడకు వెళ్తున్న వాహనాలను ఉరవకొండ, విడపనకల్ మండలాల కన్వీనర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, ఛైర్మన్లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : విజయవాడలో బుధవారం జరగనున్న బీసీ గర్జన సభకు వైసిపి శ్రేణులు భారీగా తరలివెళ్లినట్లు జడ్పిటిసి మల్లికార్జున తెలిపారు. రాయదుర్గం మండల పరిధిలోని ఆవులదట్ల గ్రామం నుంచి సుమారు 150 మంది దాకా విజయవాడకు బయలుదేరారు. వెళ్లిన వారిలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ భీమప్ప, ఎంపిటిసి అరుణ్, జనార్ధన్, శివ, ఆంజనేయులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు ఉన్నారు.

బెలుగుప్ప : విజయవాడలో జగరనున్న జయహో బిసి సభలో పాల్గొనేందుకు మండల కేంద్రం నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు బిసి నేతలు మాట్లాడుతూ బీసీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు నడిపించేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఛైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా రమేష్‌బాబు

తాడిపత్రి రూరల్ : నాయీ బ్రాహ్మణ సేవాసంఘం అధికార ప్రతినిధిగా తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రమేష్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంఘం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయీ బ్రాహ్మణుల హక్కుల కోసం చైతన్యంగా పనిచేయాలని వీరిని నియమించినట్టు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఏర్పాటు

ఉరవకొండ : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి దేవాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యం.శ్రీనివాసులు, కార్యదర్శిగా హెచ్.రామాంజనేయులు, ట్రెజరర్‌గా సి.నాగరాజుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి

బ్రహ్మసముద్రం : మండలంలోని ఆశావర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి, సిఐటియు జిల్లా కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమాతోపాటు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆశాలకు ఫేస్ స్కానింగ్ మినహాయించాలని, నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్లుఅనసూయమ్మ, రామలక్ష్మి, రత్న, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆశావర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగమణి

సచివాలయాల తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల, మడుగుపల్లి సచివాలయాలను ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా సచివాయాల్లో రికార్డులను పరిశీలించారు. వాలంటీర్లు ఆయుష్మాన్ భారత్, హౌస్‌హోల్డ్ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడుగుపల్లి పంచాయతీల పరిధిలో సాగు చేసిన చీనీ, దానిమ్మ, మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉద్యానవన శాఖ నుంచి రావాల్సిన బిల్లులు త్వరలో రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు ఆరోగ్య విషయాలు తెలుసుకోవాలి

బ్రహ్మసముద్రం : ప్రతి ఒక్క ఆశా కార్యకర్త తమకు ఇచ్చిన జనాభాలోని ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పై అధికారులకు తెలియజేయాలని వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అన్నారు. కాబట్టి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో బాలాజీ, పీహెచ్ ఎన్.మేరి, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఎంఎల్.హెచ్.పీలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.